# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!





## ధరణితోనే దర్జా..

- పారదర్శక వ్యవస్థను రూపుమాపే కుట్ర
- అన్నదాతలను ఆగం చేసేందుకు హస్తం యత్నం
- ఎన్నికల్లో గెలిచేందుకు కాంగ్రెసోళ్ల జిమ్మిక్కులు
- కాంగ్రెస్ వస్తే మా భూములకు గ్యారంటీ లేదంటున్న రైతులు

ధరణితో భూ వివాదాలు లేకుండా దర్జాగా బతుకుతున్న రైతుల జీవితాలతో ఆటలాడేందుకు కాంగ్రెసోళ్లు కుట్ర పన్నుతున్నారు. రికార్డులను అస్తవ్యస్తం చేసే పాత పద్ధతిని తెస్తామంటూ అన్నదాతపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు జిమ్మిక్కులు చేస్తున్న కాంగ్రెస్‌ను నమ్మి మోసపోమని రైతులు స్పష్టం చేస్తున్నారు. సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో భూములన్నీ భద్రంగా ఉంటాయనే నమ్మకం ఉన్నదని, ధరణి కాకుండా ఇంకేదీ మాకొద్దని చెబుతున్నారు. రైతుల సంక్షేమాన్ని తలచే కేసీఆర్ ఉంటేనే అన్ని వ్యవస్థలూ పారదర్శకంగా కొనసాగుతాయని పేర్కొంటున్నారు. ధరణిని తొలగిస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీనే తెలంగాణ నుంచి తరిమేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్న కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెబుతామంటున్న రైతుల అభిప్రాయాలు వారి మాటల్లోనే...

### కాంగ్రెసోళ్లకు ఏం తెలుసు.. రైతుల బాధలు

మేము ఇంతకు ముందు భూమి కొన్నా, అమ్మినా మాకు రిజిస్ట్రార్ ఆఫీస్ బిచ్కుందలో ఉండేది. రిజిస్ట్రేషన్ చేయాలంటే చలాన్ కట్టి అక్కడే పడిగాపులు కాచేవాళ్లం. నలుగురు వ్యక్తులు మూడు, నాలుగురోజులు తిరిగేవాళ్లం. రిజిస్ట్రేషన్ అయినా తర్వాత భూమి పట్టా అమలు చేసుకోవాలంటే పట్వారీలు, తహసీల్ ఆఫీసుల చుట్టూ చక్కర్లు కొట్టేవాళ్లం. పైరవీకారుల చేతులు తడిపితే కానీ పనులు అయ్యేవి కావు. కొంతమంది దళారులు భూమి రిజిస్ట్రేషన్ చేసి అమలు చేయకముందే ఇంకొకరికి రిజిస్ట్రేషన్ చేయించిన సందర్భాలూ ఉన్నాయి. సీఎం కేసీఆర్ రైతుల బాధలు తెలుసుకొని ధరణి తీసుకొస్తే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధరణిని తీసేసి మళ్లీ దళారీ వ్యవస్థను తీసుకొస్తామని చెబుతుండు. ఈ కాంగ్రెసోళ్ల మాట విని మోసపోవద్దు.

**- హన్మంత్‌రావ్ పాటిల్, మదన్‌హిప్పర్గా**

### ధరణితో చాలా మేలు



తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణితో చాలా మేలు జరిగింది. గతంలో రికార్డులు తారుమారు అయ్యేవి. రిజిస్ట్రేషన్ చేసుకోగానే తమ పేరున రికార్డులో నమోదవుతున్నది. దీంతో ఎవరి వద్దకూ తిరగాల్సిన పనిలేదు. ధరణి ఉంటేనే రైతుకు మేలు. ధరణి తొలగిస్తే తమ భూములకు గ్యారంటీ ఉండదు. ధరణి లేకపోతే రిజిస్ట్రార్ ఆఫీసులు, పట్వారీల చుట్టూ చక్కర్లు కొట్టాల్సిన పరిస్థితి ఉంటుంది. కేసీఆర్ సార్ తీసుకువచ్చిన ధరణి చాలా బాగున్నది. ఇది వద్దంటున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్తేనే ఇంకోసారి ధరణి గురించి మాట్లాడకుండా ఉంటారు.

**- దేవేందర్‌రెడ్డి, గోర్గల్, నిజాంసాగర్**

### భూ రికార్డులు ఆగమైతాయ్..



రైతుల భూ రికార్డులను భద్రంగా ఉంచేందుకు సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారు. ధరణిని తీసివేస్తే రికార్డులన్నీ ఆగమైతాయి. మళ్లీ దళారులు పుడతారు. రైతులకు బాధలు మొదలవుతాయి. గతంలో భూ రికార్డుల్లో అధికారులు ఇష్టం వచ్చినట్లు పేర్లు మార్చేవారు. కానీ ఇప్పుడు ధరణి ఉండడంతో రైతులకు మేలుజరుగుతుంది.

**- రాజేశ్వర్‌గౌడ్, నర్వ, మహ్మద్‌నగర్**

### ధరణితో రైతు భూమికి భరోసా



ధరణి పోర్టల్ ఉంటేనే రైతు భూమికి పక్కా భరోసా ఉంటుంది. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే సంబంధిత పత్రాలను వీఆర్వోలకు అందజేసి వారు రికార్డుల్లోకి ఎక్కించే వరకు తిరగాల్సిన పరిస్థితి ఉంటుండె. ఇప్పుడు ఆ తిప్పలు లేవు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. క్షణాల్లో తమ పేరు మీద భూమి రికార్డుల్లో నమోదవుతున్నది. ధరణి లేకపోతే కార్యాలయాల్లో ఎప్పుడు మనభూమి మన పేరు మీద ఉంటదో, రాత్రికిరాత్రే మరొకరి పేరు మీదకు మారుతుందో తెలియదు. గతంలో పహాణీల వ్యవస్థ ఉన్నప్పుడు ఎంతో మంది భూములు తెలియకుండానే బదలాయింపు జరిగాయి. అంతా అవినీతిమయంతో ఉండేది. ఇప్పుడు ఆ బాధ లేదు. మన భూమి మన వద్ద పాసు పుస్తకం, క్షణాల్లో తహసీల్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ అవుతుంది.

**- పుప్పల విఠల్, తుక్కిపల్లి, మహ్మద్‌నగర్**



పారదర్శక సేవలు.. : తహసీల్ కార్యాలయంలోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకొని సంతకాలు చేస్తున్న భూ క్రయవిక్రయదారులు (పాత చిత్రం)

### కాంగ్రెస్ వద్దే.. వద్దు

సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణి వ్యవస్థతో రైతులకు మేలు జరుగుతున్నది. దళారీ వ్యవస్థలన్నీ మూతపడ్డాయి. రైతులమే నేరుగా వెళ్లి పనులు చేసుకుంటు న్నాం. కాంగ్రెసోళ్లు వస్తే ధరణిని తీసేస్తామని అంటున్నారు. సీ ఎం కేసీఆర్ పాలనలో సుఖంగా జీవిస్తున్నాం. దళారుల రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం మాకు వద్దే వద్దు. రైతు బాంధవుడైన సీఎం కేసీఆర్‌నే మళ్లీ గెలిపించుకుంటాం.

**- నివర్తి వాగ్మారే, రైతు, పెద్దటాక్లీ**



### కాంగ్రెస్ వస్తే.. మా బతుకులు అంధకారంలోకే..

కాంగ్రెస్ హయాంలో రైతులు ఎకరం పొలం కొని వారి పేరు మీద చేసుకునేందుకు రెవెన్యూ అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా పనిచేసేవారు కాదు. దళారులు, మధ్యవర్తులను ఆశ్రయిస్తే పొలం పట్టాదారు పాస్‌బుక్‌లు వచ్చేవి. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టి క్షణాల్లోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయించి, పది రోజుల్లో ఇంటికే పాస్‌బుక్ పోస్టులో వస్తున్నది. ధరణి పోర్టల్ తీసేస్తే రైతుల బతుకులు మళ్లీ అంధకారంలోకి పోతాయి. రైతులను నిండా ముంచేందుకే కాంగ్రెసోళ్లు కుట్రలు చేస్తుండ్రు. దళారులను పెంచి పోషించేందుకు చూస్తున్నది. రైతుల మేలు కోసం పనిచేసే బీఆర్‌ఎస్‌కే మద్దతు ఇవ్వాలి. సీఎం కేసీఆర్‌ను గెలిపించాలి.

**- గణేశ్, నర్వ, మహ్మద్‌నగర్**



### చెప్పులరిగేలా తిరిగినా ఫలితముండదు..



కాంగ్రెస్ పాలనలో మా వారసత్వ భూములు మా పేరు మీద చేసుకోవడానికి నానా తిప్పలు పడ్డాం. ఏ చిన్న పని ఉన్నా గ్రామంలోని పట్వారీ దగ్గరికి వెళ్లి తహసీల్ కార్యాలయం చుట్టూ తిరిగేవాళ్లం. పట్వారీ నుంచి తహసీల్ ఆఫీసు వరకు చేతులు తడిపితేను పని అయ్యేది. అలాంటిది ఇప్పుడు ఒక్క రూపాయీ ఎవరికి లంచం ఇవ్వకుండా ఒక్కరోజులోనే పని అయిపోతుంది. ఇంత మంచి వ్యవస్థను తీసుకొచ్చిన సీఎం కేసీఆర్‌కే మా మద్దతు.

**- గొల్ల పవన్, నర్వ, మహ్మద్‌నగర్**

### ధరణి తీసేస్తే మళ్లీ లొల్లే..



ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నారు. ధరణి పోతే రైతుల మధ్య లొల్లి మొదలవుతుంది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు భూ వివాదాలతో కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవాళ్లం. అలాంటిది కేసీఆర్ పాలనలో ధరణి పోర్టల్ ద్వారా భూ వివాదాలకు తావులేకుండా చేశారు. కాంగ్రెస్ నాయకుల కళ్లబొల్లి మాటలు విని వారిని గెలిపిస్తే ధరణిని రద్దు చేసి అవకతవకల పద్ధతిని రైతుల నెత్తిన చుడతారు. ధరణిని తీసేస్తే మాలాంటి రైతులం మళ్లీ ఆగమవుతాం. ధరణి వచ్చిన తర్వాతే దళారుల చుట్టూ, తహసీల్ కార్యాలయం చుట్టు తిరిగే బాధలు తప్పాయి.

**- లింగాల శంకర్, తుక్కిపల్లి, మహ్మద్‌నగర్**

### ధరణి ఉంటేనే భూమికి భరోసా..



గతంలో రిజిస్ట్రేషన్ చేసుకుంటే భూముల కాగితాలు వీఆర్వోలకు అందజేసేవారు. వాళ్లు రికార్డుల్లోకి ఎక్కించే వరకు తిరగాల్సి వస్తుండె. ఇప్పుడు ఆ తిప్పలు లేవు. ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. తహసీల్ ఆఫీసులోనే నిమిషాల్లో తమ పేరు మీద భూమి రికార్డుల్లో నమోదవుతున్నది. పహాణీల వ్యవస్థ ఉన్నప్పుడు ఎంతోమంది భూములు వేరేవాళ్ల పేరిట బదలాయింపు అయ్యాయి. అంతా అవినీతిమయమే. ఇప్పుడా బాధ లేదు. మన భూమి మన చేతిలోనే ఉంటుంది. ధరణి వ్యవస్థ ఇలాగే కొనసాగాలంటే కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి.

**- గొట్టం నర్సింలు, నర్వ, మహ్మద్‌నగర్**